సంచీ-గిన్నె-చెప్పులు

ఒకఊళ్లో రామన్న అని ఒక పేద రైతు ఉండేవాడు. వాడికి భీమన్న సోమన్న కామన్న అని ముగ్గురు కొడుకులు. పెద్దవాడికి 15 ఏళ్లు, రెండోవాడికి 10 ఏళ్లు, మూడోవాడికి 5 ఏళ్లు. పాపం వాళ్లు చాల బీదవాళ్లవటంచేత తిండికి గడవటం కష్టంగా వుండేది. కొన్నాళ్ళయింతరవాత పెద్దవాడేమన్నాడంటే.

"నాన్నా నాన్నా, నేను పెద్దవాడినయ్యానుగదా, ఎక్కడికైనా పోయి ఏదైనా పని నేర్చుకునొస్తాను. వచ్చింతరవాత ఆ పని మీద నే బాగా డబ్బు సంపాయించవొచ్చు. నే పోతాను నాన్నా." అన్నాడు. "సరే బాగానే వుంది. వెళ్ళిరా నాయనా, డబ్బు సంపాదిస్తానంటే నేమాత్రం వద్దంటానా," అన్నాడు తండ్రి. సరే, భీమన్న, తల్లి యిచ్చిన అటుకులు, చద్దెన్నం, ఆవకాయ మూటకట్టుకుని బయల్దేరాడు. పోయిపోయి ఒక పెద్ద పట్టణంలో ఒక పెద్దషావుకారు దగ్గర గుమాస్తాగా చేరాడు. కొంచెం, లెక్కలు చాతయినవాడవటంచేత పద్దులు గిద్దులు రాస్తూ నెలకు 20 రూపాయలు సంపాయించేవాడు.

కొన్నాళ్లకి రెండోవాడైన సోమన్నకి కూడా డబ్బు సంపాయించుకు రావాలని బుద్ధిపుట్టింది. తండ్రితో చెప్పాడు తను కూడా అన్నలాగా వెళ్ళి ఉద్యోగం సంపాదిస్తానని. తండ్రి సరేనన్నాడు. సోమన్నకూడా చద్దిమూట కట్టుకుని పోయిపోయి ఒకఊళ్లో ఒక పెద్ద సత్రవులో ఎంగిలాకులు ఎత్తే నౌకరుగా చేరాడు. వాడికి ఆట్టే చదువురాదు గాబట్టి అంతేపని దొరికింది. వాడికి నెలకి పదిరూపాలిచ్చేవాళ్లు.

సామగానం సరస్వతీదేవి

అన్నలిద్దరూ చెరోదారీ పోయాక కుర్రకుంక కామన్నకి ఇంటిదగ్గిర ఏమీ తోచలేదు. తను కూడా దేశాలంబడిపోయి ఏమన్నా సంపాదించాలనుకున్నాడు. కాని వాడికి అయిదేళ్లకంటే ఎక్కువ వయస్సులేదు. మరితల్లి తండ్రులు ఒప్పుకుంటారా అంత చిన్నవాణ్ణి పంపించడానికి. వద్దనిచెప్పి ఊళ్లోనే ఒకళ్ళిట్లో పనికి కుదిర్చారు. కాని కామన్న ఊహాలు మహాపెద్దవి. హాఠాత్తుగా ఒకరోజున ఎవ్వరికీ చెప్పకుండా పారిపోయాడు. పోయిపోయి ఒక వూరిచివర ఒక మాదిగాడు కనిపించేటప్పటికి, వాణ్ణి "నా కన్నంకావాలి, ఆకలవుతోంది." అని అడిగాడు. ఈ పసీ వాడిని చూసేటప్పటికి వాడికి జాలేసి "సరే అబ్బాయ్" నీకు అన్నంపెడతాను. నాదగ్గరే వుండు. నాకు పనిలో తోడుపడుతూ వుండు." అన్నాడు.

ఇల్లా ముగ్గురూ మూడుచోట్ల పనుల్లో కుదురుకొని వుండగా పదేళ్లు గడిచాయి. భీమన్న షావుకారుదగ్గిర నమ్మకంగా పనిచేశాడు. పదేళ్లయింది కాబట్టి యింటికి వెళ్లి తల్లిదండ్రిని చూడాలనిపించింది. "ఇంటికి వెళ్ళిపోతానండి" అని షావుకార్ని అడిగాడు. షావుకారు "అయ్యో, వెళ్లిపోతావా? నీలాంటి పనివాడు దొరకటం కష్టం. నీ తల్లిదండ్రుల్ని చూడాలంటున్నావు గాబట్టి సరే వెళ్లు ఇదిగో నీకొక సంచీ యిస్తున్నాను. ఈ సంచీని "సంచీ, సంచీ, డబ్బు" అని అడిగితే ఎంతడబ్బు కావలసినా ఇస్తుంది. తీసుకెళ్లి జాగ్రత్తగా వాడుకో" అని చెప్పి భీమన్నకి సంచి యిచ్చాడు. సంతోషంతో భీమన్న ఆసంచీని తీసుకొని ఇంటికి బయల్దేరాడు తనవూరు ఇంకా 3 మైళ్లు ఉందనగా చీకటిపడింది. ఈచీకట్లో వెడితే దొంగలెవరేనా కొట్టేస్తారేమో," అనుకుని అక్కడ వున్న ఒక సత్రవులో దిగి, మకాం చేశాడు. కాని ఆసత్రవ అధికారి మహాదుర్మార్గుడు. ఇతర్ల దగ్గర ఏమన్నా వుందీ అంటే ఎల్లాగో ఓలాగు దొంగిలిస్తాడు. ఈసంగతి తెలియక భీమన్న "ఏమండోయ్, నాదగ్గిర డబ్బులేదనుకోకండి. ఎన్ని లక్షలు కావలసినా నేనివ్వగల

నాకు మహారాజాభోజనం ఏర్పాటు చెయ్యండి." అన్నాడు. సత్రవఅధికారి బలేచాన్సు అనుకుని మహారాజా భోజనంపెట్టాడు. భోజనం చేసింతరవాత డబ్బిమ్మని అడిగాడు. భీమన్న గదిలోకివెళ్లి "సంచీ సంచీడబ్బు" అనేటప్పటికల్లా డబ్బు కుప్పలుగా కురిసింది ఇదంతా కిటికీలోనించి సత్రవ యజమాని చూస్తూ కనిపెట్టాడు. భీమన్న యజమాని కివ్వవలసినదిచ్చి తక్కిన డబ్బును మూటకట్టాడు.

ఆరాత్రి సుఖంగా నిద్రపోయాడు భీమన్న. కాని యజమానికి నిద్రపట్టలా. ఎల్లాగైనా డబ్బుసంచీని కొట్టేయాలని దుర్బుద్ధి పుట్టింది. అప్పుడేం చేశాడూ. భీమన్నదగ్గిర ఉన్న సంచీలాంటిదే మరోసంచీ సంపాదించి, ఒకరాత్రి వేళ తలుపు తెరుచుకుని, భీమన్న సంచీ జాగాలో తనసంచీనిపెట్టి ఆ సంచీ లాగేసి తలుపుమూసి వెళ్లిపోయాడు. తెల్లవారింది. మారు సంచీని చూసి తన సంచీయే ననుకున్నాడు భీమన్న. సరే, యజమానీతో వెళ్లివస్తానని చెప్పి తన వూరు బయల్దేరివచ్చాడు. వచ్చేటప్పటికి తల్లిదండ్రులు కొడుకును కావిలించుకున్నారు. "ఎన్నాళ్లకి కనుపించావురానాయనా ? ఏమేం నేర్చుకున్నా వేమిటి" అని తండ్రి అడిగాడు. "చూసోండి ఒక తమాషా తెచ్చాను." అని సంచీ చూపించాడు భీమన్న. "ఏముంది ఈపాతసంచీలో. ఒట్టిదే గదా." అన్నాడు రామన్న.

"వట్టిదాంట్లోనించే డబ్బుపుట్టిస్తాను." అన్నాడు భీమన్న. అని పెద్దగొంతుగా"సంచీ, సంచి డబ్బు." అన్నాడు. అది డబ్బుసంచీ అయితేగా డబ్బు కురవడానికి. ఏమీ రాలేదు.

ఏమిటా అనుకుని మళ్లీ అన్నాడు భీమన్న. మళ్లీ పలకలేదుసంచీ. "సంచీ సంచీ డబ్బు"అని ఎన్నిసార్లు అన్నా వృథా అయింది. తెల్లపోయాడు మనిషి. తల్లిదండ్రులు నవ్వి వీడికి పిచ్చెక్కిందనుకున్నారు. పాపం భీమన్నకి ఏంజరిగిందీ తెలియక తెల్లబోయి కిమ్మనకుండా వూరుకున్నాడు.

ఇహ సోమన్న సంగతి.

కొన్నాళ్లు ఎంగిలాకులు ఎత్తాడు. తరవాత సత్రవ అధికారి వడ్డించే పని ఇచ్చాడు. పదియేళ్లు అయ్యాక "తల్లిని దండ్రిని చూడాలని పిస్తోంది. కాబట్టి సెలవిప్పించండి." అని అధికారి నడిగాడు సోమన్న. సరేనని అధికారి ఒప్పుకున్నాడు. ఇన్నాళ్లూ నమ్మకంగా పనిచేశాడు కాబట్టి, వెళ్లేటప్పుడు ఏమీ ఇవ్వకపోతే బాగుండదని చెప్పి ఒక గిన్నె ఇచ్చాడు. ఆగిన్నెని బోర్లిస్తే పంచ భక్ష్య పరమాన్నాలు వస్తాయి. బావుందనుకున్నాడు సోమన్న, బయల్దేరాడు. చీకటి పడేటప్పటికి తన అన్న భీమన్న ఆగిన సత్రవుకే వచ్చాడు. "నాకు అన్నం అక్కర్లేదు, గదిమాత్రం కావాలి"అని యజమానినడిగాడు. అన్నం అక్కర్లేదంటాడేమా అని యజమాని ఆశ్చర్యపోయి, చక్కని గది నిచ్చాడు. ఏం తింటాడో చూద్దామని కిటికీసీడల్లో నుంచున్నాడు యజమాని. సోమన్న కూర్చుని గిన్నెని బోర్లించాడు. వెంటనే

ప్రసిద్ధరచయిత:— పదేళ్ళ కిందట నాకథ ఒకటి 25 రూపా యలకి తీసుకున్నారు, జ్ఞాపకం ఉందా ?

ఎడిటరు:— అవును. అ ఇంకా ప్రచురించలేదు.

రచయిత:— ప్రచురించ నక్కర్లేదు. 250 రూపాయ లిస్తాను, నాకథ నాకిచ్చి వెయ్యండి.

ఎడిటరు:— ఎందుకని?

రచయిత:— అప్పుడునాకు ఊరూ పేరూ లేదు. ఇప్పుడు చాలాపేరు వచ్చింది. ఆపేరు పోగొట్టుకోవడం నాకిష్టంలేదు.

పంచభక్ష్య పరమాన్నాలు వచ్చాయి. శుభ్రంగా తిని, త్రేవు మని త్రేన్చి పడుకొనినిద్రపోయాడు సోమన్న. కాని యజమానికి నిద్ర పట్టక, సోమన్న గిన్నెలాంటి ఒక గిన్నెని సంపాయించు ఒకరాత్రివేళ గదిలోకివచ్చి, తనగిన్నె పక్కన పెట్టి సోమన్న గిన్నెని లాగేశాడు. ఇదేమీ తెలియని సోమన్న మర్నాడు పొద్దున తనవూరు చేరుకున్నాడు. తల్లి దండ్రీ కావిలించుకున్నారు కొడుకుని. వాడికి తొందరగా వుంది ఎప్పుడు గిన్నెమహిమ చూపిద్దామా అని. తల్లిని యీపూటకి అన్నం వండవద్దన్నాడు. భోజనం వేళకి అందర్నీ కూర్చోమన్నాడు. పెద్ద ధీమాగా గిన్నెని తండ్రి విస్తట్లో బోర్లించాడు. ఏమీ పడలేదు. భీమన్న విస్తట్లో బోర్లించాడు కాని ఏమీ పడలేదు. పోనీ తన విస్తట్లో నైనా పడుతుం

సంచీ, గిన్నె, చెప్పులు

దేమోనని బోర్లించాడు ఊహూ అది తనదైతేగా వీడికి పిచ్చెక్కిం దనుకుని అందరూ నవ్వారు తల్లి అప్పుడు లేచి అన్నం వండింది.

ఇహ కామన్న మాదిగవాడి దగ్గిర చెప్పులుకుట్టడం బాగా నేర్చుకున్నాడు పదేళ్లయింది తల్లిదండ్రుల్ని చూడాలనిపించి వెళ్లోస్తానన్నాడు మాదిగాడు సరేనని పూరికే పంపించటం బాగుండదనుకుని చెప్పులజత ఒకటి యిచ్చాడు అవి మాయచెప్పులు. అవి తొడుక్కున్నవాడికి ఏదైనా ఆపదవస్తే అవి రక్షిస్తాయి అంటే వాడిమీదికి ఎవరైనావస్తే బ్రువన ఎగిరి ఎడాపెడా బాది వదిలిపెడతాయి.

కామన్న బయల్దేరి చీకటిపడేటప్పటికి తనవూరికి మూడుమైళ్లలో వున్న సత్రవు దగ్గిరికి వచ్చాడు డబ్బులేదుకదూ దగ్గిర అందుకని అన్నం తినకుండా కాసిని మంచినీళ్లు తాగి అరుగుమీద పడుకున్నాడు కొంతసేపయ్యాక యజమాని బయటికివచ్చాడు పూరికేనే వాడు భీమన్న సంచితోనూ, సోమన్న గిన్నెతోనూ కోటీశ్వరుడయ్యాడు అయినా బుద్ధిమారలేదు ఏదో ఒకటి దొంగతనం చేస్తేగాని వాడికి తోచదు నిద్రపోతున్న కామన్నవంక చూశాడు కాళ్ళకి చెప్పులున్నాయి నిద్రపోతున్నా చెప్పులు విడవకుండా పడుకున్నాడేమా అని ఆశ్చర్యం వేసి ఇందులో ఏదోకిటుకు వుందనుకున్నాడు. మామూలుగా బుద్ధి గడ్డికరిచింది నెమ్మదిగా చెప్పులు తీయటం మొదలెట్టాడు కొంచెం లాగాడో లేదో చెప్పులు రెండూ చివ్వున ఎగిరి ఎడాపెడా దవడలు

పెద్ద పెరక్క

——ఫొటో. పి. వీరన్న, విజయవాడ.

★ సంచీ, గిన్నె, చెప్పులు ★

వాచేట్టు బాదేయటం మొదలెట్టాయి. కామన్న నిద్రపోతూనే వున్నాడు.

యజమాని దెబ్బలు తింటూ అక్కడే కేకలేస్తే కామన్న లేస్తాడేమోనని లోపలికి పరిగెత్తాడు. చెప్పులు వెంటబడి వీపూ, దవడలూ, ముక్కూ, మూతీ చితక్కొట్టేస్తున్నాయి. పట్టుకొందామంటే అందవు.

ఎక్కడికిపోయినా వెంటబడుతున్నాయి. నెత్తురు కారుతోంది నోట్లోంచి. వీపు వాచిపోయింది. బాబోయ్, బాబోయ్ అని కేకలేశాడు. అందరూ లేచారు. ఎవరికీ ఏమీ తోచక వాళ్లూ కేకలెయ్యటం మొదలెట్టారు. ఈ కేకలకి కామన్న లేచి చెప్పులు లేకపోవటం చూసి సంగతేమిటో తెలుసుకుందామని లోపలికెళ్లాడు. యజమాని కామన్న కాళ్ళమీద పడి "బాబోయ్ రక్షించు. తప్పు చేశాను. ఇహ నెప్పుడూ దొంగతనం చెయ్యను బుద్ధి వచ్చింది." అన్నాడు. కామన్న చేత్తో చెప్పులు పట్టుకొని తొడుక్కొని "నువ్విది వరకు దొంగతనం "చేశావా"అని అడిగాడు.

చేశాను. ఇద్దరు అమాయకుల దగ్గర్నించి ఒక డబ్బుసంచీ, ఒక అన్నపుగిన్నె దొంగిలించాను." అన్నాడు. "అయితే నాకియ్యి అవి" నేను తీసుకుపోతా"నన్నాడు.

"ఇవ్వకపోతే చెప్పులు నిన్ను చంపేస్తాయి." అని బెదిరించాడు. యజమాని ఏంచేస్తాడు? వచ్చి నట్లు తీసుకొచ్చి యిచ్చాడు. చూస్తే సంచీపాతది, గిన్నె చిల్లుది.

"దీంట్లో, ఏమున్నాయని దొంగిలించావు"అని కామన్న అడిగాడు.

"బాబూ! దీంట్లో, మహిమలున్నాయి." అని యజమాని ఆ మహిమలన్నీ కామన్నకు చెప్పాడు.

"సరే యిక నెప్పుడూ దొంగతనం చెయ్యకు. బుద్ధిగా వుండు" అని తెల్లారేక గిన్నె, సంచీలతో కామన్న స్వగ్రామం చేరుకున్నాడు. తల్లీ తండ్రీ కొడుకుని కావలించుకున్నారు. తల్లిని అన్నం వండద్దన్నాడు. తండ్రిని పనిలోకి వెళ్లవద్దన్నాడు. వాళ్లు సంగతేమిటని అడిగారు.

"ఏమీ లేదు నేను రెండువస్తువులు తెచ్చాను. అవి మనకు పంచభక్ష్య పరమాన్నం, కావలసినంత డబ్బు యిస్తాయి." అని గిన్నె "సంచీలు చూపించాడు.

"పోరా పిచ్చివాడా! నీ అన్నలిల్లాగే తెచ్చారు. మహిమలూ లేవు మాయలూ లేవు. వట్టి సంచీ డబ్బు నిస్తుందా? వట్టిగిన్నె అన్నం పెడుతుందా." అన్నాడు తండ్రి.

"అలా కాదు, నేను చూపిస్తాగా!" అని కామన్న సంచీ బోర్లించి "సంచి, సంచీ, డబ్బు!" అన్నాడు. డబ్బు కుప్పలుగా కురిసింది.

విస్తట్లో గిన్నె బోర్లించాడు. రకరకాల ఆహారపదార్థాలు తయారయ్యాయి. తల్లీ, తండ్రీ, అప్పుడే పొలంలో పనిచేసి వచ్చిన భీమన్న, సోమన్న అంతా ఆశ్చర్యపోయారు.

అన్నం కడుపునిండా తిన్నారు. డబ్బుతీసి దాచారు. భీమన్న "నీకీ సంచి ఎక్కడిదిరా?" అని కామన్నను అడిగాడు. కామన్న తను సత్రవలో బస చెయ్యడం, సత్రవ యజమాని తన చెప్పులు దొంగిలించడం వగైరా సంగతులన్నీ చెప్పాడు. అప్పుడు భీమన్న, సోమన్న ఒక్కసారిగా "ఈ సంచీ నాదే", "ఈ గిన్నె నాదే" అని సంతోషంతో అరిచారు. "సత్రవ యజమానికి మహా బాగా బుద్ధి చెప్పావు" అని తమ్ముణ్ణి మెచ్చుకున్నారు. కామన్న భీమన్న సంచీ భీమన్నకి, సోమన్న గిన్నె సోమన్నకూ ఇచ్చివేశాడు.

వీటితో ముగ్గురు అన్నదమ్ములూ, వారి తల్లిదండ్రులూ గొప్ప భాగ్యవంతులయ్యారు. తోటిమానవులమొడ దయగా ఉంటూ, దానధర్మాలు చేస్తూ, అతిథులను సత్కరిస్తూ, ద్రోహం తలపెట్టిన వాళ్లకు చెప్పుదెబ్బలు బహుమానం చేస్తూ చాల ఏళ్లు సుఖంగా జీవించారు. ★

ఒక స్కూల్కి ఇనస్పెక్టరు తనిఖీకి వెళ్లాడు: హిస్టరీక్లాసులో ఒక కుర్రాణ్ణిపిలిచి:

"అబ్బాయీ, ఏ యుద్ధమయినా సరే కరక్టుగా ఏ సంవత్సరంలో జరిగిందో చెప్పు. నీకు గుర్తున్నది చెప్పు.

"1111 సం॥లో ఏయుద్ధము జరగలేదండీ"

—ప్రతాపరావు, విశాఖపట్నం.